

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





బుధవారం, ఆగస్టు 5, 2026 పేజీలు :7


### నవాబుపేట పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ జానకి

# ఆకస్మిక తనిఖీ..

### పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశం




**మహబూబ్‌నగర్, ఆగస్టు 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ దరావత్ జానకి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్‌లు, కేసు రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు వివరాలు, పెండింగ్ కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్ కేసుల దర్యాప్తును సకాలంలో పూర్తి చేసి చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. రాత్రి గస్తీని

### మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు

# సమన్వయంతో పనిచేయాలి

### -యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం అందరి బాధ్యత

### -జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 04 (ప్రజా జ్యోతి) నాగర్‌కర్నూలు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి వంటి మత్తు పంటల అక్రమ సాగు నియంత్రణ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవసరమైన చర్యలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ పాటిల్ తో కలసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జిల్లా స్థాయి నార్కో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా,నిల్వ,విక్రయాల వినియోగంపై సంబంధిత శాఖలు నిరంతర నిఘా కొనసాగించాలని,

### ఉప సర్పంచ్‌ల సమస్యల

# పరిష్కారానికి కృషి చేస్తాం



### హాజరు పుస్తకంలో పేరు...

# తరగతి గదిలో జాడ లేదు!"

### – సంఘం కోసం సమయం... విద్యార్థులకు విరామమా.?



**మహమ్మదాబాద్ ఆగస్టు 4 ( ప్రజా జ్యోతి ):** "గురువు అంటే మార్గదర్శి" అని పుస్తకాలు చెబుతాయి... కానీ "ఉదయం హాజరు, మధ్యాహ్నం మాయ" అనే కొత్త పాఠాన్ని కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు బోధిస్తున్నట్లున్నారు. మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ ఘటన విద్యార్థుల కంటే పెద్దలకు ఎక్కువ పాఠం చెబుతోంది.

# డిజిటల్ తెలంగాణ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలి

## -ప్రజలకు అవినీతిరహిత సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం
## -అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య




నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 04 (ప్రజా జ్యోతి)

ప్రభుత్వ సేవలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడంలో అధికారులు,మీ సేవ నిర్వాహకులు కీలకంగా వ్యవహరించాలి,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ తెలంగాణ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని,ఈ మార్పులను జిల్లా ప్రజలకు పూర్తిస్థాయిలో చేరవేయడంలో ప్రతి శాఖ,ప్రతి అధికారి, ప్రతి మీ సేవ కేంద్రం సమిష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య సూచించారు.సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా,పారదర్శకంగా,జవాబుదా రీతనంతో ప్రజలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ భవనంలో సదరం పోర్టల్,నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, లేబర్ కార్డు,ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌తో పాటు వివిధ మీ సేవ సేవల అమలు విధానంపై జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లకుఒకరోజు శిక్షణ కార్యక్రమమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య శిక్షణను ప్రారంభించి అధికారులకు,మీసేవ నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూప్రజలకు ప్రభుత్వం అందించే సేవలు సులభంగా, వేగంగా,ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబా టులో ఉండేలా ప్రభుత్వం సమగ్ర డిజిటల్ వ్యవస్థను రూపొందించిందని గతంలో చిన్నచిన్న ధ్రువీకరణ పత్రాలు,సంక్షేమపథకాల దరఖాస్తుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సి వచ్చేదని,భౌతిక పత్రాలు సమర్పించాల్సి వచ్చేదని,దీనివల్ల సమయం,ధనం,శ్రమ వృథా కావడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపించేందుకే ప్రభుత్వం డిజిటల్ సేవలను విస్తృతంగా అమలు చేస్తోందని వివరించారు.ఇకపై సదరం పోర్టల్,నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం లేబర్ కార్డు,ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్,కుల,ఆదాయ, నివాస,కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, జనన--మరణ ధ్రువీకరణ పత్రాలు,వ్యవసాయ మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలు తదితర ప్రభుత్వ సేవలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉంటాయని ప్రజలు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించిన వెంటనే సంబంధిత అధికారుల లాగిన్‌కు దరఖాస్తులు చేరేలా ప్రభుత్వం అత్యాధునిక వ్యవస్థ రూపొందించిందన్నారు. గ్రామ పాలన అధికారులు,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు,తహసీల్దార్లు,ఇతర సంబంధిత అధికారులు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మీ సేవ మొబైల్ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే దరఖాస్తులను పరిశీలించి,అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను నిర్ణీతగడువులోగా పూర్తి చేసి ఫైళ్లను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా,దరఖాస్తును వేగంగా పరిష్కరించడంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.ఆదేశించారు.ప్రజలను చిన్నచిన్న పనుల కోసం కార్యాలయాలకు పదేపదే రప్పించడం,భౌతిక పత్రాలు కోరడం,అనవసరంగా ఆలస్యం చేయడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితు ల్లోనూ అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు సేవ చేయాలనే బాధ్యతతో పనిచేయాలని,ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించకుండా సేవాభావంతో స్పందించాలని,ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే అధికారులు సమయపాలనతో,బాధ్యతాయుతంగా విధులు నిర్వహించా ల్సిన అవసరం ఉందని,కొత్త డిజిటల్ విధానంలో దరఖాస్తు నమోదు చేసిన వెంటనే దరఖాస్తుదా రుడి మొబైల్ నంబర్‌కు అప్లికేషన్ నంబర్, సేవ పేరు, చెల్లించిన రుసుము వివరాలతో కూడిన డిజిటల్ రసీదును ఎస్ఎంఎస్ రూపంలో అందుతుందని ఆ సందేశంలోని లింక్ ద్వారా దరఖాస్తు స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని రసీదును డౌన్‌లోడ్ చేసుకోవడం, ప్రింట్ తీసుకోవడం కూడా సులభమని,దీంతో కాగితపు రసీదులు పోగొట్టుకోవడం, కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం వంటి సమస్యలు తొలగిపోతాయని,డిజిటల్ తెలంగాణ కార్యక్రమం కేవలం సాంకేతిక మార్పు మాత్రమే కాదని,ప్రజలకు సమర్థవంతమైన,అవినీతిరహిత,పారదర్శకమైన పాలన అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర పరిపాలనా సంస్కరణ అని అన్నారు.ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్ళి ప్రతి అర్హుడికి సమయానికి సేవలు అందించడం,ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా పరిష్కరించడం ప్రభుత్వ సంకల్పమన్నారు.అనంతరం ఈడిఎం నరేష్ మాట్లాడుతూ జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు సరైన మార్గనిర్దేశం చేయాలని,దరఖాస్తుల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా శ్రద్ధ వహించాలని గ్రామ పాలనాధికారులు,రెవెన్యూ అధికారులు,అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతోపనిచేసి డిజిటల్ సేవలు గ్రామీణ స్థాయి వరకు సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, లేబర్ ఆఫీసర్ రాజ్‌కుమార్,మీ సేవ సూపరింటెండెంట్ శోభ,జిల్లా మేనేజర్ నరేష్ తో పాటు పాటు జిల్లాలోని అన్ని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

# హాజరు పుస్తకంలో పేరు...
# తరగతి గదిలో జాడ లేదు!"

ఉదయం హాజరు నమోదు చేసి, మధ్యాహ్నం ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడం చూస్తే... హాజరు పుస్తకానికే బోధన చేస్తున్నారా? లేక విద్యార్థులకా? అన్న సందేహం కలుగుతోంది. సాధారణ ఉపాధ్యాయుడు ఇలా చేస్తే మెమో, షోకాజ్ నోటీసు, వివరణ... కానీ సంఘ నాయకుడైతే "నాకు ఎవరు ఏమి చేస్తారు?" అనే భావనతో నడుచుకుంటే, సంఘం అంటే హక్కుల వేదికా? లేక బాధ్యతల నుంచి మినహాయింపు పత్రమా? ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడాలి. అది సముచితమే. కానీ అదే సంఘ నాయకులు విద్యార్థుల హక్కులను కాలరాస్తే, "గురువు గౌరవం" గురించి చెప్పే నైతిక హక్కు ఎక్కడ ఉంటుంది? మధ్యాహ్నం తరగతి గదిలో గురువు కనిపించక విద్యార్థులు ఎదురుచూడాల్సి రావడం, తల్లిదండ్రులు ఆశ్చర్యపోవడం బాధాకరం. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు కొందరి వ్యక్తిగత నిర్లక్ష్యమే అయినా, మొత్తం ఉపాధ్యాయ సమాజంపై మచ్చ వేస్తాయి. మండల విద్యాధికారి రాజు నాయక్ స్పందిస్తూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పడం స్వాగతించదగ్గ విషయమే. అయితే చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నిరోధించేలా ఉండాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. "గంట మోగేది విద్యార్థుల కోసమా... లేక సంఘ నాయకుల సౌకర్యం కోసమా?" హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయడం ఒక్కటే విధి నిర్వహణ కాదు. పాఠశాల ముగిసే వరకు తరగతి గదిలో ఉండి విద్యార్థులకు బోధించడమే నిజమైన హాజరు. సంఘ నాయకత్వం గౌరవప్రదమైన బాధ్యతే కానీ, అది విధులకు ప్రత్యామ్నాయం కాదు. విద్యార్థుల భవిష్యత్తు కంటే గొప్ప సంఘం ఏదీ లేదు.

# నవాబుపేట పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ జానకి ఆకస్మిక తనిఖీ..

మరింత పటిష్ఠంగా నిర్వహించడం, గ్రామస్థాయి సమాచార వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో నవాబుపేట సబ్‌ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

గంజాయి వంటి మత్తు పంటల అక్రమ సాగును ఎక్కడైనా గుర్తించినా వెంటనే చట్టపరమైన చర్య చేపట్టాలని,అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో సమాచార మార్పిడి,సమన్వయం మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసు,విద్య, వైద్య,ఎక్సైజ్ తదితర శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని,యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి,సంబంధిత శాఖలు సమిష్టి బాధ్యతతో చర్యలను చేపట్టి యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు,కళాశాలలు,విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు,ఆరోగ్యపరమైన దుష్పరిణామాలు,కుటుంబాలపై వాటి ప్రభావం,ఎన్‌డీపీఎస్ (టీఖాశా) చట్టం నిబంధనలు,చట్ట ప్రకారం విధించే కఠిన శిక్షలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.అదేవిధంగా మత్తు పంటల సాగు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి డ్రగ్స్ గుర్తింపుకు అవసరమైన పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి,జిల్లాలోని డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) మరియు పునరావాస కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వ్యసన బాధితులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని,పోలీసు శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ,సున్నితమైన ప్రదేశాలలో సమర్థవంతమైన నిఘాతో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాల న్నారు.వ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లాపోలీసు యంత్రాంగం సంబంధిత శాఖలతో సమన్వయం పెంచుకుంటూ పటిష్ట చర్యలు చేపడుతున్నామని మాదకద్రవ్యాల అక్రమ రవాణా,నిల్వ,విక్రయాలు,వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని,డ్రగ్స్ మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చెన్నయ్య,దేవ సహాయం,అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు,జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి,జిల్లా విద్యాశాఖ అధికారి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి,జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్,సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్లు,అధికారులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

నర్వ, జులై 4 ప్రజా జ్యోతి

నారాయణపేట జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మ్యాతరి నర్వ మండలం రాయికోడు గ్రామానికి చెందిన గోపాల్‌ను తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీకేఆర్ బాలకృష్ణారెడ్డి, నర్వ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను మ్యాతరి గోపాల్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఉప సర్పంచ్‌లకు తగిన అధికారాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.అన్ని అంశాలను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి శ్రద్ధగా విని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణాభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలి హరి నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ పాల్గొన్నారు.

# త్రిఫ్ట్ ఫండ్,చేనేత భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలి

## పులిపాటి వెంకటేష్

**గద్వాల,ఆగస్టు 4(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని,త్రిఫ్ట్ ఫండ్ (చేనేత పొదుపు నిధి)తో పాటు చేనేత భరోసా పథకం కింద పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు, 21వ,వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మగ్గాన్నే నమ్ముకుని జీవిస్తున్న చేనేత కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.త్రిఫ్ట్ ఫండ్ కింద గత 14 నెలలుగా పేరుకుపోయిన బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక మంది చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.గత 14 నెలలకు సంబంధించిన త్రిఫ్ట్ ఫండ్ బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా చేనేత కార్మికుల ఆర్‌డీ--2 (=ణ-2) ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.చేనేత రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న వేలాది కుటుంబాలు ఉపాధి సంక్షోభంతో పాటు సంక్షేమ పథకాల అమలులో జాప్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్రిఫ్ట్ ఫండ్,చేనేత భరోసా పథకాల కింద పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేసి చేనేత కుటుంబాలకు అండగా నిలవాలని పులిపాటి వెంకటేష్ డిమాండ్ చేశారు.



## చిన్నారుల హక్కులు,రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

**గద్వాల,ఆగస్టు 4(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జాతీయ న్యాయ సేవా సంస్థ (నల్సా) అమలు చేస్తున్న చిన్నారుల సంక్షేమ,రక్షణ పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవా సంస్థ,జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో మంగళవారం కేటీదొడ్డి మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ కొండాపూర్ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ బి.శ్రీనివాసులు,జిల్లా సంక్షేమ అధికారి సునంద ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు.చిన్నారులకు చట్టం కల్పించిన హక్కులు,నల్సా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం,పోక్సో చట్టం--2012,బాల్య వివాహాల నిషేధ చట్టం--2006,బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ)చట్టం,విద్యా హక్కు చట్టం--2009,జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం--2015, సైబర్ భద్రతతో పాటు చిన్నారుల రక్షణకు సంబంధించిన వివిధ చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,చిన్నారులు ఎలాంటి వేధింపులు,దుర్వినియోగం లేదా హింసకు గురైనా వెంటనే తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని,అలాగే ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు 15100 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ప్రతి చిన్నారికి సురక్షిత వాతావరణంలో జీవించే హక్కు,విద్యను అభ్యసించే హక్కు,హింస,దుర్వినియోగం నుంచి రక్షణ పొందే హక్కులను భారత రాజ్యాంగం, వివిధ బాలల సంక్షేమ చట్టాలు






కల్పించాయని వివరించారు.విద్యార్థులు సోషల్ మీడియా,ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ)నరసింహ,చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.రఘురామిరెడ్డి,సీడబ్ల్యూసీ కౌన్సిలర్ సురేష్,చైల్డ్‌లైన్ ప్రతినిధి నవీన్,ఎవీ ఫౌండేషన్ ప్రతినిధి హనిమిరెడ్డి,భరోసా కేంద్రం ప్రతినిధి శ్వేత,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆశ డేలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమీక్ష..

## తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన -- అడ్డాకుల, జానంపేట పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళవారం అడ్డాకుల, జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడ్డాకుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన "ఆశ డే" సమావేశంలో పాల్గొని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ వ్యాధుల నివారణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ, తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని పేర్కొన్నారు. తల్లిపాలలో ఉండే యాంటీబాడీలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచి ఇన్ఫెక్షన్లు, వివిధ వ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. తల్లిపాలు సులభంగా జీర్ణమవడంతో పాటు శిశువు ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని, మెదడు ఎదుగుదల, తెలివితేటల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. అలాగే భవిష్యత్తులో స్థూలకాయం, ఆస్తమా వంటి సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. తల్లులకు కూడా తల్లిపాల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొంటూ, పాలివ్వడం ద్వారా అదనపు కేలరీలు ఖర్చై ప్రసవానంతర బరువు తగ్గుతుందని, ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలై రక్తస్రావం తగ్గుతుందని తెలిపారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని చెప్పారు. అనంతరం జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, వైద్య సేవలు, రికార్డులు, ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.



## గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 04 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా మచ్చుంపేట నియోజకవర్గం లోని మున్ననూరు బాలికల గురుకులంలో ఇంటర్ విద్యార్థిని రసాయనంతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. సిబ్బంది వెంటనే అచ్చంపేట ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.విద్యార్థిని ఆత్మహత్య యత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.ఇటీవల ఫుడ్ పాయిజన్ సంఘటనను కూడా దాచి పెట్టారని గురుకులంలో భద్రతపై విచారణ జరపాలని విద్యార్థిని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆగస్టు 7న జోగులాంబ గద్వాలలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

**గద్వాల,ఆగస్టు 4(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7న (శుక్రవారం) ఉదయం 10 గంటలకు జోగులాంబ గద్వాల పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి చేనేత నడక (హ్యాండ్‌లూమ్ వాక్)ను ప్రారంభిస్తారని తెలిపారు.కార్యక్రమంలో చేనేత వస్త్రాల వినియోగం,చేనేత కళల పరిరక్షణ,చేనేత వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.చేనేత వస్త్రాల కొనుగోలు,వినియోగం ద్వారా చేనేత కార్మికులకు ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని,సహజ నారతో తయారయ్యే చేనేత వస్త్రాలు ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు హుందాతనాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు విస్తృతంగా చేనేత వస్త్రాలను వినియోగించి చేనేత రంగానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన"తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగం-భవిష్యత్ అవకాశాలు"అనే అంశంపై వ్యాసరచన,చిత్రలేఖనం తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఈ కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు,ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్ని చేనేత,ఉన్ని,సిల్క్ సహకార సంఘాల అధ్యక్షులు,చేనేత కార్మికులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సహాయ సంచాలకులు ఇందిర కోరారు.

## గూడెం గ్రామంలో అభివృద్ధికై గ్రామసభ

**చిన్నంబావి ఆగస్టు 4 (ప్రజా జ్యోతి)**
వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం గూడెం గ్రామంలో సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో గ్రామ లో చేపట్టబోయే అభివృధి ప్రణాళిక గురించి చర్చించడం జరిగింది. అలాగే 'జీపీడీపీ' ప్రణాళిక ప్రకారం చేపట్టబోయే అభివృద్ధి పనులపై స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. "ఇళ్ల వద్ద తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా ఉంచడం చాలా ముఖ్యం. తడి చెత్తలో వర్షపు నీరు చేరితే దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదముంది" అని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.చదువు, భద్రత, పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, రోజువారీగా బడికి పంపాలని, విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపిటిసి రామస్వామి,పంచాయతీ కార్యదర్శి విక్రమ్ యాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు వెంకటస్వామి, బి మోహన్, శ్రీదేవి, గ్రామ ప్రజలు పి బాలకృష్ణ, బి శివకుమార్,చిన్న నరసింహ,రాఘవేంద్ర శెట్టి, ఎం రాజు, వేణు సాగర్,బిచ్చన్న, ఏ కురుమయ్య,షేర్ పల్లి వెంకటస్వామి, అంగన్వాడి టీచర్ పార్వతమ్మ,ఆశ వర్కర్లు యశోద భాయి,తదితరులు పాల్గొన్నారు'



# జిల్లా కేంద్రంలో పడకేసిన పారుశుద్యం

**-ఖాలి స్థలాలే డంపింగ్ యాడ్లు**
**-చెత్త సేకరణ అస్తవ్యస్తం -స్వచ్ఛత అధ్వాన్నం**







**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 04 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో పారుశుద్యం,చెత్త సేకరణ అస్తవ్యస్తంగా మారింది. ఇంటింటా చెత్తసేకరణకు ప్రత్యేకంగా "స్వచ్ఛ ఆటోలు" ఉండగా మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ సరిగా లేక ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.ప్రతి రోజు చెత్త సేకరించే సిబ్బంది ఏ సమయంలో చెత్త సేకరిస్తారోఎప్పుడు "డుమ్మా" కొడతారో తెలియని పరిస్థితి నెలకొని ఉందడంతో రోడ్లకు ఇరువైపులా, ఖాళీస్థలాలు,ఇళ్ల పక్కన "చెత్త"ను పడేస్తుండటంతో పారిశుద్ధ్యం లోపిస్తోంది. రోడ్లపైనే చెత్త కుప్పలు నాలాల్లోకి వ్యర్థాలతో పట్టణవ్యాప్తంగా ఏ వీధిలో చూసినా "చెత్త"తో కూడిన కుప్పలే దర్శనమిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి ఇంటి నుంచి నిత్యం చెత్తను సేకరించాల్సి ఉండగా పట్టణంలో అమలు కావడం లేదు.దుకాణాలు,ప్రైవేట్ ఆసు పత్రుల నుంచి మాత్రం ఠంఛన్ గా "చెత్త"ను తరలిస్తున్నారని ఇళ్లకు మాత్రం నామమాత్రంగా వస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.సమయానికి "చెత్త బండి" రాకపోవడంతో కొన్ని చోట్ల ఇంటి యజమానులు చెత్తను రోడ్లపై పడేస్తున్నారు.ఇప్ప టికైనా మున్సిపల్ అధికారులు చెత్త సేకరణ వ్యవ స్థను పక్కద్భందిగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నాగర్ కర్నూల్ నుండి గోవాకు స్పెషల్ బస్సు

**-డిపో మేనేజర్ యాదయ్య**




**నాగర్ కర్నూల్ : ఆగస్టు 04 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈ నెల 11న,,గోవా విహార యాత్రకు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ యాదయ్య తెలిపారు.మధ్యాహ్నం రెండు గంటలకు నాగర్ కర్నూల్ డిపో నుండి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని ఈ యాత్రలో బాగా బీచ్,డౌనా పౌలా,కాలంగూట్,చర్చ్ లను సందర్శించే అవకాశం ఉందని,రానుపోను చార్జీలు 4 వేలు నిర్ణయించడం జరిగిందని వివరాలకు 98850429895- 9490411591 నంబర్లను సంప్రదించాలని డిపో మేనేజర్ తెలిపారు.

## డిగ్రీ అడ్మిషన్లకు చివరి అవకాశం

**-ఈ నెల 6 నుండీ కొత్త రిజిస్ట్రేషన్లు**
**-కళాశాల ప్రిన్సిపల్ గీతాంజలి**



**నాగర్ కర్నూల్ : ఆగస్టు 04 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి డి. ఓ.ఎస్.టి ద్వారా చివరి విడత అడ్మిషన్లు ప్రారం భం కానున్నాయి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ .కే. గీతాంజలి తెలిపారు.ఆగస్టు 6 నుంచి11 వరకు కొత్త రిజిస్ట్రేషన్లు,ఆగస్టు 12 వరకు వెబ్ ఆప్షన్లు స్వీకరించడం జరుగుతుందని బి.ఎఫ్.ఎస్.ఏ, బి.ఏ,బి.కాం కోర్సుల్లో పరిమిత సీట్లు అందుబా టులో ఉన్నాయని ప్రిన్సిపల్ డాక్టర్ కె గీతాంజలి ఒక ప్రకటనలు తెలిపారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను విజయవంతం చేయాలి

**-అదనపు కలెక్టర్ మధుమోహన్**
**- ఎస్ఐఆర్‌కు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు**
**-జిల్లాలో 87.10 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి**



**గద్వాల,ఆగస్టు 4(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విజయవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ కోరారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించినట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 5,03,859 ఎన్యూమరేషన్ ఫారాలు ఉండగా,వాటిలో 4,38,852 ఫారాల (87.10 శాతం) డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు.ఇంకా 63,488 యూఈఎఫ్‌లు (12.60 శాతం),1,519 ఎన్యూమరేషన్ ఫారాలు (0.30 శాతం) మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.మిగిలిన ఫారాల డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా ముగించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గైర్హాజరైన, వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలని అధికారులను ఆదేశించారు.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా చేపట్టనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం సజావుగా కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.తమ పరిశీలనలో గుర్తించిన పలు అంశాలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి,కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలు చేశారు.ఈ సమావేశంలో గద్వాల తహసీల్దార్ హరికృష్ణతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

## కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వర ఆలయం

**నాగర్ కర్నూల్ : ఆగస్టు 04 ( ప్రజా జ్యోతి )**

శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్ మట్టం క్రమంగా పెరుగుతుండడంతో నాగర్ కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్దగల పవిత్ర పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర ఆలయం నీట మునిగింది.ఆలయం యొక్క శైవ,వైష్ణవ శిఖరాలు మాత్రమే నీటి ఉపరితలంపై కనిపిస్తున్నాయి.ఏడు పవిత్ర నదులైన కృష్ణ,వేణి, తుంగభద్ర,భవాని,ఉజ్జయిని.భీమా,వైష్ణవ ఏడు నదులు కలిసి ప్రవహించే ఈ సప్తనదీ సంగమ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగింస్తుంది.వేసవికాలంలో నీటిమట్టం తగ్గినప్పుడు మాత్రమే భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు.ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో వరద నీరు చెరడంతో ఆలయం పూర్తిగా నీటి లో మునిగి ఆలయ శిఖరాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి.ఈ అరుదైనదృశ్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంటుంది.ఆలయ ప్రధాన అర్చకులు తేలకపల్లి రఘురామయ్య శర్మ గత సోమవారం కృష్ణానదిలో మరంబోటు ప్రయాణం చేసి ఆలయ శిఖరంపై పూజలు నిర్వహించారు.



## జూరాల ఉగ్రరూపం !

**-కొనసాగుతున్న భారి వరద**
**-27 గేట్లు ఎత్తేసిన అధికారులు -శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు**

నాగర్ కర్నూల్ : ఆగస్టు 04 ( ప్రజా జ్యోతి )

ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో జూరాల జలాశయానికి జలకళ సంతరించుకుంది.మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు జూరాల నుంచి శ్రీశైలం జలాషయానికి 2,21,765 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ఈ సీజన్లో జూరాల నుంచి మొదటి సారి రెండు లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం నమోదు ఇది కావడం విశేషం. ఇరిగేషన్ అధికారులు 27 గేట్లు రెండు మీటర్ల మేరకు ఎత్తి నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.



# తేదీలు కాదు.. పాలమూరు రైతుల పొలాలకు కృష్ణమ్మ నీళ్లు కావాలి

## భండారి శాంతికుమార్



**మహబూబ్‌నగర్, ఆగస్టు 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** పాలమూరు --రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలకమైన కరివెన (కురుమూర్తిరాయ) రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి పాలమూరు రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకులు ఎగ్గని నర్సింహులు ఆధ్వర్యంలో, పాలమూరు బీజేపీ నాయకులతో కలిసి కరివెన రిజర్వాయర్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ నిర్మాణ పురోగతి, పెండింగ్ పనులు, కాల్వల నిర్మాణం, భూసేకరణ, పునరావాసం--పునఃస్థిరీకరణ అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం భండారి శాంతికుమార్ మాట్లాడుతూ, "పాలమూరు ప్రజలు తేదీల మీద తేదీలు విని విసిగిపోయారు. ఇప్పుడు కొత్త ప్రకటనలు కాదు... రైతు పొలానికి కృష్ణమ్మ నీళ్లు కావాలి" అని అన్నారు. కరివెన రిజర్వాయర్ నిండడం మాత్రమే ప్రాజెక్టు విజయానికి కొలమానం కాదని, ఆ నీరు కాల్వల ద్వారా చివరి ఆయకట్టు రైతు పొలం వరకు చేరినప్పుడే అసలు లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు.

కరివెన రిజర్వాయర్ వరకు మెయిన్ ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం పనుల పురోగతిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అనేక పనులు ఇంకా నిలిచిపోయినట్లు కనిపిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో నిర్ణీత గడువులో పనులు ఎలా పూర్తవుతాయో ప్రభుత్వం వివరించాలని అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం, పునరావాస సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. "ఎవరు ప్రాజెక్టు ప్రారంభించారు, ఎవరు క్రెడిట్ తీసుకుంటారన్నది తర్వాత విషయం. ముందుగా పాలమూరు రైతుకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలి. మాటలు కాదు... పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి" అని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో బీజేపీ రాష్ట్ర నాయకులు పడకుల బాలరాజు, అచ్చుగట్ల అంజయ్య, నంబి రాజు, రవీందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నిరంజన్, నాగరాజు, శేఖర్ రెడ్డి, ఆంజనేయులు, సుధీర్, పిల్లి సూర్యనారాయణ, అవినాష్, సదానంద్, బుచ్చిబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ..

## జిల్లా వ్యాప్తంగా నేడు సైబర్ జాగృక్తా దివస్ అవగాహన కార్యక్రమాలు



**మహబూబ్‌నగర్, ఆగస్టు 4( ప్రజా జ్యోతి బ్యూరో ):** కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృత సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ దరావత్ జానకి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాల్లో పోలీసులు సైబర్ భద్రతపై అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనలు, పెట్టుబడి ఆఫర్లు, ఆన్‌లైన్ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్, కస్టమర్ కేర్ పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా అధికారిక వెబ్‌సైట్లు, అధికారిక మొబైల్ యాప్‌లనే ఉపయోగించాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

బలమైన పాస్‌వర్డ్లు, టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (2ఎఫ్ ఏ) వినియోగించడం ద్వారా డిజిటల్ ఖాతాలను మరింత భద్రపరచుకోవాలని సూచించిన ఎస్పీ, సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ జాగృక్తా దివస్ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ జానకి కోరారు.

## తల్లి పాలు శిశువుకు తొలి రక్షణ కవచం...

చిన్నంబావి ఆగష్టు 03 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండలం గూడెం గ్రామంలోని అంగన్ వాడి సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి అధ్యక్షతన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు చేసిన సందర్భంగా సర్పంచ్ వెంకట్ రెడ్డి మాట్లాడుతు ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహించే తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం మంచి శుభసూచికం ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా ప్రోత్సహించాలని తల్లిపాల యొక్క ప్రయోజనాలు పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు పాలు (కొలస్ట్రం) శిశువుకు మొదటి టీ కాలా పనిచేస్తాయని శిశువురోగనిరోధక శక్తిని పెంచుతయాని సరైన ఎదుగుదల, మెదడు అభివృద్ధికి తోడ్పడ తాయని మొదటి 6 నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ఉత్తమం అని అన్నారు. తల్లికి కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని తల్ల బిడ్డ అనుబంధం బల పడుతుంది అని అదేవిధంగా తల్లి పాలు బిడ్డకు తొలి హక్కు అని ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు నాంది అని సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి అన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ విక్రమ్ యాదవ్ . యుపిఎస్ స్కూల్ టీచర్ నరేందర్. అంగన్వాడి టీచర్ పార్వతమ్మ. వార్డు నెంబర్లు కురువ వెంకటస్వామి. ఆశా వర్కర్లు యశోద బాయి . గర్భిణీ స్త్రీలు బాలింతలు. గ్రామ గ్రామస్తులు బాలకృష్ణ. విష్ణు సాగర్ .పలువురు మహిళలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోండి..

## రాష్ట్ర అవార్డులకు గడువు ఆగస్టు 11

**మహబూబ్‌నగర్, ఆగస్టు 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో విజయ కుమారి తెలిపారు.ప్రభుత్వ, ప్రభుత్వోన్నత, ఎయిడెడ్ పాఠశాలలు, సీటీఈ, డైట్, కేజీబీవీ, టీజీఆర్ఈఐఎస్, ఐఏఎస్ఈ, మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు "రాష్ట్ర స్థాయి అవార్డులు--2026" కోసం ఆగస్టు 11, 2026 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 11 తర్వాత అందిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలి

**గద్వాల ఆగస్టు 4(ప్రజా జ్యోతి ప్రతినిధి):** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగీ,చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని స్థాయిల్లో అప్రమత్తంగా ఉండి సమర్థవంతమైన నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా.సంధ్య కిరణ్మయి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్వైజరీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలో అమలవుతున్న జాతీయ,రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సూచికల వారీగా సమీక్షించిన ఆమె,అన్ని కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి మెరుగైన ప్రగతి సాధించాలని అధికారులకు సూచించారు.సూపర్వైజరీ సిబ్బంది అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ,ఫీల్డ్ సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు అందించి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు అన్ని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఫీల్డ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతర ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు.నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ అర్హులందరికీ స్క్రీనింగ్ చేయాలని,అనుమానిత కేసులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.స్క్రీనింగ్ శాతాన్ని పెంచడంతో పాటు ఫాలోఅప్‌ను కూడా తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన,నిరంతర ఆరోగ్య సేవలు అందించాలని,గర్భిణులను గుర్తించిన వెంటనే నమోదు చేసి అవసరమైన పరీక్షలు,సేవలు,వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి చిన్నారికి పూర్తి స్థాయిలో వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాలని, అవసరమైన అన్ని రకాల మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,బస్తీ దవాఖానాల్లో అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరంతరంగా నిర్వహించాలని,సూపర్వైజరీ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.హెచ్‌ఎంఐఎస్,ఎన్‌సీహెచ్ పోర్టల్‌లో ప్రతిరోజూ సమాచారాన్ని నమోదు చేయాలని,ప్రతి ఆరోగ్య కార్యక్రమం లక్ష్యాల సాధనపై పీహెచ్‌సీ వారీగా సమీక్షలు నిర్వహించి నిర్దేశించిన గడువులో ప్రగతి సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా స్థాయి ప్రోగ్రామ్ అధికారులు,సూపర్వైజరీ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు సంబంధించి పలు సూచనలు,మార్గదర్శకాలు జారీ చేశారు.



# విద్యార్థులకు 'ధ్యాన' బోధన

## కొప్పునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పిరమిడ్ ధ్యాన శిక్షణ





**చిన్నంబావి, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి)**
మారుతున్న జీవనశైలితో విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో.. చిన్నతనం నుంచే ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవర్చుకోవడానికి ధ్యానం దోహదపడుతుందని పిరమిడ్ మాస్టర్లు తెలిపారు.చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామంలోని పీఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అమ్మా–నాన్న పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు నంది చంద్రశేఖర్ రెడ్డి, నంది జయమ్మ మాస్టర్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పీఎస్ఎస్ఎం వనపర్తి పిరమిడ్ మాస్టర్లు జ్ఞానేశ్వరి, జైపాల్‌రెడ్డి, రమేష్ విద్యార్థులకు ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. 'ధ్యానం అంటే శ్వాసపై ధ్యాస' అని పేర్కొంటూ.. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయాలని సూచించారు. వయస్సుకు సమానమైన నిమిషాల పాటు రోజుకు రెండుసార్లు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని తెలిపారు.విద్యార్థులు ప్రార్థనా సమయంలో ఐదు నిమిషాలు, గేమ్స్ పీరియడ్‌లో మరో ఐదు నిమిషాలు ధ్యానం చేయాలని సూచించారు. ధ్యానం వల్ల ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు చదువుపై ఆసక్తి మెరుగుపడుతుందని, పరీక్షల సమయంలో భయాన్ని అధిగమించేందుకు దోహదపడుతుందని వివరించారు.ప్రస్తుత జీవనశైలిలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఒత్తిడి జీవితంలో భాగమవుతోందని పేర్కొన్నారు.విద్యార్థులు విద్యలోనే కాకుండా జీవితంలోనూ ఉన్నతంగా రాణించాలంటే బాల్యదశ నుంచే ఏకాగ్రత, క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, మానసిక స్థైర్యం అవసరమని తెలిపారు. పాఠశాల స్థాయిలో ధ్యాన అభ్యాసాన్ని అలవర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడంతోపాటు ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వ వికాసం మెరుగుపడి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.కొప్పునూర్ గ్రామంలో ఉన్న అమ్మా--నాన్న పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పిరమిడ్‌లో కూర్చొని ధ్యానం చేయడం ద్వారా అధిక శక్తిని పొందవచ్చని వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పీఎస్ ప్రధానోపాధ్యాయుడు అనుకలి శివరాముడు, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి, తెలుగు పండిట్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సమన్వయంతో నిర్వహించాలి

## – జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**
ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా...నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు.
మంగళవారంనాగర్‌కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,అదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవ సహాయం,అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,...... ఆగస్టు 15న జరిగే వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
వివిధ ప్రభుత్వ శాఖల తరపున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పుర ప్రముఖులు, అతిథులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం సీపీఓ, రూపొందించాలని ఆదేశించారు.
సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలని, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.
అలాగే అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచడం, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, వేదిక అలంకరణ, పూలమొక్కల ఏర్పాటు, తివాచీలు, బ్యారికేడ్లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ తదితర ఏర్పాట్లను ఎలాంటి లోపాలకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్థక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాల, పంచాయతీరాజ్, తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# చిన్నంబావిలో వేగంగా నమోదు (సార్) ప్రక్రియ 89.38 శాతం పూర్తి!

**24,724 మంది ఓటర్లు.. 22,099 ఫారాల డిజిటైజేషన్**
**22,095 ఫారాల ధ్రువీకరణ.. 89.38 శాతం పురోగతి**



**చిన్నంబావి, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి)**
భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా చిన్నంబావి మండలంలో ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ వేగం పుంజుకుంది. ఓటర్ల వివరాల సేకరణ, ఎలక్టర్ ఫారాల డిజిటైజేషన్, క్షేత్రస్థాయి ధ్రువీకరణ కార్యక్రమాలను అధికారులు ముమ్మరం చేశారు.చిన్నంబావి మండలంలోని 32 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. అవసరమైన పత్రాలను పరిశీలించి, అర్హత కలిగిన ఓటర్ల వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం మండలంలో మొత్తం 24,724 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 22,099 ఎలక్టర్ ఫారాలు డిజిటైజ్ చేశారు. అందులో 22,095 ఫారాలను బీఎల్ఓలు ధ్రువీకరించారు. దీంతో మొత్తం ప్రక్రియలో 89.38 శాతం పురోగతి నమోదైంది.డూప్లికేట్ ఓట్లపై ప్రత్యేక దృష్టి ఓటరు జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు (డీఎస్ఈ), గైర్హాజరు ఓటర్లు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన ఓటర్ల (ఏఎస్‌డీ/యూఈఎఫ్) వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. అనర్హమైన నమోదులను గుర్తించి తొలగించడంతో పాటు, అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు.అర్హులైన ప్రతి ఓటరుకూ చోటుఈ సందర్భంగా తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడంతో పాటు, అర్హత లేని నమోదులను తొలగించే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఇంకా ఎలక్టర్ ఫారాలు సమర్పించని ఓటర్లు వెంటనే తమ ఫారాలను సమర్పించి బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# తాడూరు మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

## -రోడ్డు వెంట సూచిక బోర్డులు పెట్టాలి
## -మారేడు శివశంకర్ డిమాండ్






**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 04 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ మండల కేంద్రంనుండి తాడూరుమండల కేంద్రానికి.వెళ్లే ప్రధాన మార్గంలో సరైన దారి సూచిక బోర్డులు,వీధి దీపాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి మారేడు శివ శంకర్ అన్నారు.తాడూరు వైపువెళ్లే చౌరస్తాలో మార్గం చూపే సూచిక బోర్డులు లేకపోవడంతో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు,సామాన్య ప్రజలు ఏటు వెళ్లాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారని,సరైన సూచికలు లేక తాడూరుకు దారెటు అని అడుక్కుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఉందని,దీనికి తోడు రహదారి పొడవునా విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ, వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో ఆ ప్రాంతమంతా అంధకారం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని,వీధి దీపాలు లేకపోవడం వల్ల చీకటిలో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని,రోడ్డు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రహదారి వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేసి,తక్షణమే వీధి దీపాలను ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.